# కార్మికవర్గ అగ్రగామి దళ కర్తవ్యం

**నేడు** మనదేశంలోని కార్మికుల స్థితిగతులు అత్యంత దారుణంగా వున్నాయి. 70 సంవత్సరాల 'స్వతంత్ర' దేశ పాలకుల 'ప్రజాస్వామ్య' పాలనలో కార్మికుల జీవన, పని పరిస్థితులు రోజురోజుకీ దిగజారిపోతున్నాయి. నేటి అత్యాధునికమైన, సాంకేతికంగా అభివృద్ధి చెందిన యుగంలో కార్మికుల శ్రమదోపిడీ అన్నది అత్యంత నిర్దాక్షిణ్యంగానూ, దారుణంగానూ పలురూపాల్లో నిరాఘాటంగా సాగించబడుతోంది. సంపదను సృష్టించి, వృద్ధిపరిచే కార్మికులకు సమాజంలో గౌరవప్రదమైన స్థానం అన్నదే లేకుండా పోయింది. ప్రజాస్వామ్యంపేరిట, మెజార్టీగా వున్న శ్రామిక, కార్మిక ప్రజల ప్రయోజనాలకూ, ఆకాంక్షలకూ విరుద్ధంగా, మైనార్టీ దోపిడీవర్గ పాలకుల యిష్టాయిష్టాలకు, ప్రయోజనాలకూ అనుగుణంగా పాలనా వ్యవస్థ సాగుతోంది.

దేశంలోని కార్మికులు ఇటువంటి దుస్థితిలోకి నెట్టబడటానికి కారణం-పాలకులూ, పాలకవర్గాలూ అనుసరించి, అమలుజరిపిన ప్రజావ్యతిరేక, ప్రత్యేకించి కార్మిక వ్యతిరేక దోపిడీ విధానాలే అన్నది నిస్సందేహం! బ్రిటిష్ వలసపాలకుల నుండి 1947లోనే, దేశంలోని పాలకులకు 'అధికారమార్పిడి' జరిగినా, దేశ పాలకులు అనుసరించి, అమలుజరిపిన విధానాల్లో మాత్రం మౌలికంగా ఏ రకమయిన మార్పూ జరగలేదు. అదే రాజ్యాంగ యంత్రం, అవే ప్రజావ్యతిరేక చట్టాలను యథాతథంగా స్వీకరించిన 'స్వతంత్ర' పాలకులు, వాటినే అమలు జరిపారు. ప్రత్యేకించి సామ్రాజ్యవాద విదేశీ పెట్టుబడిని పరిరక్షించి, దాని ప్రయోజనాలను పెంపొందించే పారిశ్రామిక విధానాలను పాలకులు చేపట్టి, వాటిని దేశంలో అమలుజరిపారు.

ఆ పారిశ్రామిక విధానాల అమలు పర్యవసానమే, నేడు దేశంలోని కార్మికుల దారుణ దుస్థితి! దేశ ప్రయోజనాలు, దేశ ప్రజల ప్రయోజనాలు, దేశప్రజల అవసరాలతో నిమిత్తం లేని, విదేశీ పెట్టుబడికి అనుకూలమైన పారిశ్రామిక విధానాలను మన పాలకులు, పాలక వర్గాలూ అమలుచేసి సామ్రాజ్యవాదులకు తాము దళారీలన్న విషయాన్ని స్పష్టపరిచారు. ఈ పారిశ్రామిక విధానాల ఫలితంగా దేశసంపద వివిధ రూపాల్లో, వివిధ పేర్లతో విదేశీ బడాపెట్టుబడిదారులకు తరలింపబడింది. ఇందుకు ప్రతిగా దేశంలోని ప్రజలను, ప్రత్యేకించి కార్మికులను నిర్దాక్షిణ్యమైన దోపిడీ, పీడనలకు గురిచేయటం జరిగింది, జరుగుతోంది. పాలకులు-పాలకవర్గాలూ అనుసరించే, అమలుజరిపే యీ దోపిడీ విధానాలే గత 25 సంవత్సరాలుగా ముమ్మరం చేయబడ్డాయి. సంక్షోభంలో కూరుకుపోయిన సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క సంక్షోభభారం దేశ ప్రజలపైనా ప్రత్యేకించి కార్మికులపైనా బలవంతంగా రుద్దబడింది. విదేశీ సామ్రాజ్యవాద పెట్టుబడి యొక్క సూపర్-లాభార్జనా వేటకు కార్మిక వర్గాన్ని బలిపశువుల్ని చేసే పెట్టుబడిదారీ నయా ఉదారవాద ఆర్థిక విధానాలు అమలులోకి వచ్చాయి.

బ్రిటిష్ వలస పాలకుల కాలంలోనే అనన్యమైన త్యాగాలు సలిపి, మహత్తర పోరాటాల ద్వారా భారత కార్మికవర్గం సాధించుకొన్న చట్టబద్ధ హక్కులను నిరాకరించే ప్రక్రియ ప్రారంభింపబడి, కార్మికచట్ట సంస్కరణలపేరిట చట్టబద్ధంగానే హక్కులను రద్దుచేయటం అన్న దిశలో వేగవంతం చేయబడింది.

ప్రపంచీకరణలో సామ్రాజ్యవాద పెట్టుబడి లాభాల వేటకోసం, తీవ్రమయిన శ్రమదోపిడీ సాగించాలి. ఇందుకోసం కార్మిక హక్కుల చట్టాలను అమలు జరపటం - శ్రమ దోపిడీని నియంత్రించటం అన్న బాధ్యతను పాలకులు-పాలకవర్గాలు-పాలక ప్రభుత్వాలు స్వచ్ఛందంగానే విడనాడాయి. ఆఖరుకు అంతర్జాతీయంగా గుర్తింపుపొంది, ప్రపంచమంతటా అమలులోవున్న 8 గంటల పనిదినం అన్న విధానాన్ని సహితం నిరాకరించటం (చట్టబద్ధంగానే) జరుగుతోంది. ఫ్యాక్టరీచట్టం, పారిశ్రామిక వివాదాలచట్టం, కనీస వేతన చెల్లింపు చట్టం, కార్మిక సంఘాల ఏర్పాటుహక్కు చట్టం తదితర చట్టాలన్నీ సవరింపబడుతూ, ఆ చట్టాలయొక్క లక్ష్యం చట్టబద్ధంగానే నిరాకరింపబడుతోంది.

క్రమంగా ప్రభుత్వరంగ సంస్థలు నష్టకారకంగానూ, జబ్బుపడ్డాయి అన్నపేరిట మూసివేయబడ్డాయి. వీలైనంత మేరకు పరిశ్రమలు ప్రైవేటీకరింపబడ్డాయి. ఇంతవరకూ సంఘటిత రంగంలో అమలులోవున్న శాశ్వత ఉద్యోగుల నియామక పద్ధతి క్రమంగా నీరుకార్చబడి, ఆ స్థానంలో క్యాజువల్, టెంపరరీ, కంటెన్‌జెన్సీ ఉద్యోగుల నియామక పద్ధతి అమలులోకి వచ్చింది. దీనికితోడు పనులను ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టులద్వారా చేయించుకొనే పద్ధతి, పరిశ్రమల్లో భారీఎత్తున అమలులోకి వచ్చింది. ఈ క్యాజువల్, టెంపరరీ, కంటెన్‌జెన్సీ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగు పద్ధతులు అమలులోవున్న కార్మిక చట్టాల పరిధిలోకి రానందున, యీ పేర్లతో నియామకంలోకి వచ్చిన కార్మికులకు ఎటువంటి చట్టబద్ధమయిన హక్కులుగానీ, సదుపాయాలుగానీ లభించవు. ఇటువంటి చాకచక్యమైన పన్నాగంతో కార్మిక చట్టాల స్ఫూర్తినీ, లక్ష్యాన్నీ ఓడించి, కార్మికుల శ్రమదోపిడీని యథేచ్ఛగా సాగించే మార్గాన్ని బడాపారిశ్రామిక పెట్టుబడిదారీ వర్గం ఏర్పాటు చేసుకొంది. బడాపెట్టుబడికి దళారీలుగా సేవలు అందిస్తున్న పాలకులూ - పాలకవర్గాలూ, అందుకు మిన్నకుండిపోయి, ఆ బడాపెట్టుబడివర్గాన్నే సమర్థిస్తున్నాయి.

ఈ విధానాల పర్యవసానంగా ప్రభుత్వరంగంలో సహితం శాశ్వత ఉద్యోగులసంఖ్య దారుణంగా కుదించబడింది. కాంట్రాక్టు, టెంపరరీ, ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికుల వ్యవస్థ బలోపేతం అయింది. ఇక ప్రైవేటురంగంలో అయితే యాజమాన్యాలకు పట్టపగ్గాలే లేకుండా పోయాయి. క్రమంగా సంఘటితరంగ కార్మికుల సంఖ్య కుదింపుకు గురై, మెజారిటీ కార్మికులు అసంఘటిత, అనియతరంగ కార్మికుల వ్యవస్థలోకి మారిపోయారు. నేడు దేశంలో వున్న మొత్తం కార్మికుల, శ్రామికుల సంఖ్యలో కేవలం 4 నుండి 5 శాతం మంది మాత్రమే సంఘటితరంగ కార్మికులు. మిగిలిన 95 శాతం మంది అసంఘటిత, అనియతరంగ కార్మికులే. అంటే యీ 95% మందికి ఎటువంటి చట్టబద్ధ రక్షణకానీ, హక్కులుగానీ, ఉద్యోగ భద్రతకానీ, సామాజిక భద్రతకానీ లేదు; లభించదు. కార్మికులు ట్రేడ్ యూనియన్‌లో సంఘటితపడే హక్కు బాహాటంగానే నిరాకరించబడుతోంది. కార్మికులు సంఘం పెట్టుకో ప్రయత్నిస్తే యాజమాన్యలు దాడులు జరుపుతున్నాయి. పాలకులూ, ప్రభుత్వాలూ అందుకు సహకరిస్తున్నాయి. అంతేకాదు ఈ అసంఘటిత, అనియత రంగ కార్మికులకు పని ప్రదేశాలలో భద్రత కూడా లేదు. అపాయకరమైన, కష్టసాధ్యమైన, ప్రమాదకర పరిస్థితుల్లో ఎటువంటి భద్రతా ఏర్పాట్లు, భద్రతా నియమాలు, భద్రతా సామాగ్రి లేకుండా పనిచేస్తూ, ఆ కార్మికులు నిరంతరం పని ప్రదేశాల్లో శలభాల్లా మాడి మసైపోతున్న పరిణామం యిప్పుడు అదనంగా ఏర్పడింది. వీరికి పరిహారం చెల్లింపజేసే చట్టం కూడా ఏదీ లేదు. ఆఖరుకు స్వతంత్రమైనదని చెప్పబడే న్యాయవ్యవస్థ కూడా దోపిడీ పాలక పెట్టుబడిదారీ వర్గాలకే కొమ్ముకాస్తోంది. ఇటువంటి దారుణ జీవన, పని పరిస్థితులు విధించిన మన పాలకుల దోపిడీ పారిశ్రామిక విధానాలు, మహిళా కార్మికుల శ్రమదోపిడీని మరింతగా భారీస్థాయిలో సాగించటానికి దోహదం చేశాయి - చేస్తున్నాయి. మహిళా సాధికారత పేరిట టెక్స్‌టయిల్స్, ఫార్మా, దుస్తుల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర రంగాలలోకి మహిళలను నియమించుకొంటూ, కారుచౌక కూలికి, అధికాధిక పనిభారంతో మహిళల శ్రమశక్తిని దోపిడీ చేయటం చట్టబద్ధంగానే జరుగుతోంది. ఈ మహిళల శ్రమశక్తిని రాత్రి షిఫ్టుల్లో కూడా దోపిడీ చేసుకోవటానికి వీలుగా కార్మిక చట్టాలకు సవరణలు తేబడ్డాయి.

ఇది పారిశ్రామిక రంగపు దారుణ ముఖచిత్రమైతే, అటు దేశానికి వెన్నెముకగా వుంటూ, మెజార్టీ గ్రామీణ ప్రాంత ప్రజలకు జీవనోపాధిని కల్పించే వ్యవసాయ రంగం, ఉద్దేశ్యపూర్వకంగానే నిర్లక్ష్యం చేయబడి తీవ్రమయిన సంక్షోభానికి గురిచేయబడింది. దీని పర్యవసానంగా గ్రామీణ భారతం విధ్వంసం చేయబడి గ్రామీణ శ్రామికులు, పేద-సన్నకారు రైతాంగమూ, పొట్టచేత బట్టుకొని, జీవనోపాధి వెతుక్కొంటూ పట్టణాల బాట పట్టాల్సిన విధిలేని పరిస్థితిలోకి నెట్టబడ్డారు. వీరు ఎటువంటి నైపుణ్యంలేని, ప్రమాదకరమైన, దుర్భరమైన శారీరక శ్రమజేసే దాసీపనివారిగా, సేవకులుగా, అనాధలైన రోజువారీ కూలీలుగా బ్రతుకులు ఈడ్వాల్సి వచ్చిన దుస్థితిలోకి నెట్టబడ్డారు. ఇది పాలకులు - పాలకవర్గాలు అనుసరించిన, అమలుజరుపుతున్న దోపిడీ, ప్రజావ్యతిరేక విధానాల పర్యవసానమే!

ఈ రకంగా కార్మికులనూ, శ్రామికులనూ - భారత పాలకులూ, దోపిడీ పాలకవర్గాలూ బడాపెట్టుబడికి స్వాధీనపరచి, వారిని నిరంతర, నిర్దాక్షిణ్య దోపిడీకి గురయ్యే అవస్థలపాలు చేశారు.

ఇది సహించరాని విషయం. ఇది ప్రజాస్వామ్యం ఎంతమాత్రం కాదు. ఆచరణలో-అనుభవంలో యిది మైనార్టీ దోపిడీవర్గాల దుష్టపాలనాస్వామ్యం. ఇటువంటి పెట్టుబడిదారీ దోపిడీవర్గ పాలనా వ్యవస్థను కూలద్రోసి, దాని స్థానంలో శ్రామికవర్గ పాలనా వ్యవస్థను స్థాపించటం ద్వారా మాత్రమే, నిజమయిన అర్థంలో ప్రజాస్వామ్యం సాధ్యమవుతుంది.

కేవలం శ్రామికవర్గం మాత్రమే అటువంటి కర్తవ్యాన్ని నిర్వహించగలుగుతుంది. అయితే శ్రామికవర్గం యీ మొత్తం సమాజాన్నంతటినీ దోపిడీ, పీడనలనుండి వర్గ పోరాటాలద్వారా తనతోబాటు విముక్తి పరచనంత వరకూ, తనను తాను దోపిడీ, అణచివేతలనుండి విముక్తం చేసేకోలేదు. ఇది కార్మికవర్గంపై చరిత్ర విధించిన బాధ్యత.

అయితే నేటికీ భారతదేశంలోని కార్మికులూ, శ్రామికులూ సరయిన శాస్త్రీయ అర్థంలో ఒక వర్గంగా రూపొందబడలేదు; సంఘటితపడలేదు. అంటే కార్మికులూ, శ్రామికులూ ఒక వర్గంగా సంఘటితపడట మన్నది వారి విముక్తికి ఒక ముందు షరతు అన్నమాట. కార్మికులూ-శ్రామికులూ ఒక వర్గంగా రూపొందటమన్నది యాదృచ్ఛికంగానో, అప్రయత్నపూర్వకంగానో జరిగే విషయంకాదు.

క్రమానుగతంగా కార్మికులను వర్గ రాజకీయ చైతన్యవంతులను చేయాలి! వారిని ఐక్యం చేయాలి! వారిని సంఘటిత పరచాలి! వారిని శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా పోరాటమార్గంలో నడిచేవైపు పురిగొల్పాలి! వారి పోరాటాల జయాపజయాలను, గుణపాఠాలను అర్థంచేయించాలి. తమతోపాటు యితర శ్రామిక వర్గాల ప్రజల విముక్తికోసం పోరాడాల్సిన తప్పనిసరి ఆవశ్యకతను వారు గుర్తించేట్టు చేయాలి. అంటే కార్మికులు - శ్రామికులు, తమతోపాటు దోపిడీకి, పీడనకు, అణచివేతకూ నిరంతరం గురవుతున్న గ్రామీణ పేదలతో, రైతాంగంతో ఐక్యమై, పోరాటం సల్పాల్సిన తప్పనిసరి ఆవశ్యకతను గుర్తింపజేయాలి! అందుకు నిరంతరం వారిని వర్గరాజకీయాలతో చైతన్యపరుస్తూ, సంసిద్ధపరచాలి! ఆ రకంగా పోరాటాల క్రమంలో కార్మికులను - శ్రామికులను ఒక వర్గంగా రూపొందించాలి. అంతవరకూ దేశంలోని కార్మికులకు, శ్రామిక ప్రజలకూ, రైతాంగానికి, దోపిడీ, అణచివేతల నుండి విముక్తిని సాధించే ఆయుధం తయారుకాదు!

ఈ చారిత్రాత్మక కర్తవ్యాన్ని నిర్వహించాల్సిన తక్షణ బాధ్యత, యిప్పటికే రూపొందిన కార్మికవర్గ అగ్రగామి శక్తులదే! ఈ శక్తులే యిందుకు పట్టుదలతో, దీక్షతో పూనుకోవాలి!

అయితే కేవలం యీ అంశాన్ని గుర్తించినంత మాత్రాన, లేదా యీ సూత్రాలను వల్లెవేసినంతమాత్రాన అటువంటి కర్తవ్యాన్ని నిర్వహించినట్టుకాదు. లేదా యాంత్రిక పద్ధతుల్లోనూ, లాంఛనప్రాయంగానో, యీ కర్తవ్య నిర్వహణకు పూనుకొన్నా, కర్తవ్య లక్ష్యాలు సాధింపబడవనేది స్పష్టం.

కార్మికుల్లో మమేకమవటం, నిరంతరం వారి సమస్యలను అధ్యయనం చేయటం, వారి అనుభవాల ప్రాతిపదికపై ఆ సమస్యలను చర్చించటం, దోపిడీ – అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడేందుకు వారిని సంఘాలలో సంఘటితపరచటం, సంఘాలు పెట్టించటం, సంఘాల నాయకత్వంలో రోజువారీ సమస్యలపై పోరాడేందుకు పురికొలప్పటం చేయాలి. వారికి నిరంతరం వర్గరాజకీయాలను, వాటి అవగాహనను కల్పించటం, సమస్యలపై పనిచేసే క్రమంలో–సమస్యల ప్రాతిపదికా ఐక్యతను (కార్మికుల్లో) సాధించటం, క్రమక్రమంగా కార్మికుల చైతన్యస్థాయిని పెంచటం, కార్మికులలో వర్గ రాజకీయ చైతన్యస్థాయి పెరిగిన శక్తులపై ప్రత్యేకమైన శ్రద్ధపెట్టి వారిని రాజకీయ పోరాటాలు నిర్వహించే స్థాయికి అభివృద్ధిపరచటం, నాయకత్వస్థాయికి అభివృద్ధిపరచటం – అనే నిరంతరాయ కృషిద్వారానే కార్మికులను, శ్రామికులను ఒక వర్గంగా రూపొందించటం సాధ్యమవుతుంది. ఇది ఎంతో ఓపికతో, శ్రమతో చేపట్టాల్సిన కృషి. ఇందుకు దగ్గర మార్గాలేమీ లేవు. అత్యంత నిబద్ధతతో నిర్వహించాల్సిన కృషి యిది.

1847–50 కాలంలో తమ ప్రసిద్ధ "కమ్యూనిస్టు ప్రణాళిక"ను ప్రకటించిన నాటినుండీ మార్క్స్, ఎంగెల్సులు యీ అంశాన్నే–కార్మికులను ఒక వర్గంగా రూపొందించాల్సిన అవసరాన్ని – పదే పదే నొక్కి చెబుతూ, దోపిడీ పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా, దాని రద్దుకోసం తమ పోరాటాన్ని ఎక్కుపెట్టారు. వారి బోధనలను, వాటి లోతులను సక్రమంగా అర్థం చేసుకోవటంవల్లనే లెనిన్ సోవియట్ యూనియన్‌ను స్థాపించగలిగాడు. మావో చైనా విప్లవాన్ని విజయవంతం చేయగలిగాడు.

నేటి అర్థవలస–అర్థభూస్వామ్య వ్యవస్థను కూలద్రోయటం తమ లక్ష్యంగా ఎంచుకొన్న శ్రామికవర్గ అగ్రగామిదళం కూడా, తక్షణం చేపట్టవల్సిన కర్తవ్యం అదే! కార్మికులను ఒక వర్గంగా రూపొందించటమే!

ooooo